## మొక్కలు నాటిన 'రోటరీ' ప్రతినిధులు

మొక్క నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

కామారెడ్డి రూరల్, ఆగస్టు 24: కామారెడ్డి పట్టణంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి, సత్యం, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

## దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కామారెడ్డి, ఆగస్టు 24 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దూరవిద్య డిగ్రీ మొదటి సంవత్సరం బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు గడువు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లుకళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఇంటర్,ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్,ఐటీఐ లేదా ఏదైనా 10+2, డిప్లొమా, ఇంటర్ సమానమైన కోర్సులో పాసైనవారు అర్హులని పేర్కొన్నారు. డిగ్రీ రెండు, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 31వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.మిగతా వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేదా 7382929695 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి, ఆగస్టు 24 : జిల్లా కేంద్రానికి చెందిన పీఎంపీ ఫరీద్‌పేట్ శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా..బాధిత కుటుంబానికి పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జిల్లా ప్రతినిధులు అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి కామారెడ్డి జిల్లా పీఎంపీ అసోసియేషన్ తరపున రూ. 33.400 ఆర్థిక సాయం శనివారం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులగం మోహన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపల్లి బాలకిషన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నక్క శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్‌డీ చారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు గడీల చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక శాఖలో పేర్లు నమోదు చేసుకోవాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, ఆగస్టు 24 : ప్రతి భవన నిర్మాణరంగ కార్మికుడు కార్మిక శాఖలో తమ పేరును నమోదు చేసుకొని లబ్ధి పొందాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో శనివారం భవన, ఇతర నిర్మాణరంగ కార్మికుల సంక్షేమంపై జిల్లా స్థాయి అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్మిక చట్టం ప్రకారం భవన, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటి నిర్మాణానికి అయ్యే వ్యయం విలువలో ఒక శాతం సెస్ వసూలు చేసి కార్మిక శాఖకు చెల్లించాలని సూచించారు. నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారులు ఒక శాతం లేబర్ సెస్ వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డుకు జమ చేయాలని ఆదేశించారు.ప్రతి భవన నిర్మాణ కార్మికుడు 110 రూపాయలు చెల్లించి కార్మికశాఖలో పేరు నమోదు చేసుకోవాలని, తద్వారా అనేక ప్రయోజనాలు పొందే అవకాశం ఉందన్నారు. సహజ మరణం పొందితే రూ.లక్షా 30 వేలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6.30 లక్షల వరకు వారి కుటుంబం లబ్ధి పొందవచ్చని తెలిపారు. పాక్షిక వైకల్యం కలిగితే రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు,కార్మికుడి కూతురు వివాహం కోసం రూ.30వేలు, ప్రసూతి సహాయ పథకాలకు రూ.30 వేల వరకు పొందవచ్చని వివరించారు. జిల్లా అధికారులు వారి వారి శాఖల్లో నిర్మాణ పనులు జరిగినప్పుడు పని ప్రదేశాలను పరిశీలించి, కార్మికులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, సీపీవో రాజారాం, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి,అన్ని ఇంజినీరింగ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

### కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ డబ్బాను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

కామారెడ్డి, ఆగస్టు 24 : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ డబ్బాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయద్దని సూచించారు. ప్లాస్టిక్ సేకరణ డబ్బాలను కొత్తబస్టాండ్, ప్రభుత్వ దవాఖాన వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మిర్జా ఆఫీస్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, భాస్కర్‌గౌడ్, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, గరిగంటి లక్ష్మీనారాయణ, ఏఈ శంకర్, ఎస్సై సర్వేజ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# 'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

కామారెడ్డి,ఆగస్టు 24 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన చేయనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మఠం విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మాయా ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్, దయాకర్, నాయకులు రమేశ్, నరేశ్, ప్రవీణ్, రాజేందర్, యోగేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

### రెండున్నర తులాల బంగారం, 20తులాల వెండి అపహరణ

గాంధారి, ఆగస్టు 24: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన గాంధారిలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నరేంద్రనగర్ కాలనీలో నివాసించే పత్తి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి సదాశివనగర్ మండలంలోని పోసానిపేట్ గ్రామంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. రాత్రి 11.30 గంటలకు ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలోని రెండున్నర తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలతో పాటు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి యజమాని పత్తి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో క్లూస్ టీం సహాయంలో ఆధారాలు సేకరించారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## భిక్కనూరులో ప్రైవేట్ దవాఖాన సీజ్

భిక్కనూరు, ఆగస్టు24: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానను డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ సీజ్ చేశారు. దవాఖానకు ఇటీవల వైద్యం కోసం వచ్చిన పెరుముల స్వామి అనే వ్యక్తి వైద్యం వికటించి మృతి చెందాడు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో స్థానిక మెడికల్ ఆఫీసర్ యోమియా, వైద్యసిబ్బందితో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం ప్రైవేట్ దవాఖానకు వచ్చి విచారణ చేపట్టగా హాస్పిటల్‌లో పనిచేసే వైద్యుడి పేరుతో ఎలాంటి లైసెన్స్ లేకపోవడం, మెడికల్ దుకాణాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుండడాన్ని నిర్ధారించుకొని రెండింటినీ సీజ్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు.

### సంక్షిప్తంగా..

- **ఇసుక లారీ పట్టివేత:** నస్రుల్లాబాద్, ఆగస్టు 24: బీర్కూర్ శివారులోని మంజీరా ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు శనివారం పట్టుకున్నారు.
- **రేషన్ షాపు ఏర్పాటు చేయాలని వినతి:** భిక్కనూరు, ఆగస్టు 24: మండలంలోని తిప్పాపూర్ దళిత వాడలో కొత్తగా రేషన్‌షాపును ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ శివ ప్రసాద్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ.. తిప్పాపూర్‌లోని దళిత వాడకు రేషన్‌షాపు కిలో మీటర్ దూరంలో ఉండడంతో సరుకుల కోసం వెళ్లడానికి వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

# ఓటరు జాబితాలో తప్పులుంటే సవరించాలి

నస్రుల్లాబాద్, ఆగస్టు 24: బీర్కూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ లత శనివారం బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లను తొలగించాలని,18 ఏండ్లు నిండిన వారిని చేర్చుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరించాలన్నారు.

హన్మాజీపేట్‌లో ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న బీఎల్వోలు

**వార్డుల వారీగా సర్వే**

బాన్సువాడ రూరల్, ఆగస్టు 24 : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో బీఎల్వోలు శనివారం వార్డుల వారీగా ఓటరు జాబితా సర్వే చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్ వార్డుల వారీగా ఓటర్ల వివరాలు, మృతి చెందిన ఓటర్ల వివరాలు, కొత్త ఓటర్ల నమోదుపై బీఎల్వోలతో చర్చించారు. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. బీఎల్వోలు రేణుక, దత్తు తదితరులు ఉన్నారు.

## గెస్టు ఫ్యాకల్టీ సమస్యలు పరిష్కరించాలని వినతి

బాన్సువాడ, ఆగస్టు 24: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్టు ఫ్యాకల్టీలు శనివారం ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని బాన్సువాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన పోచారం వెంటనే కమిషనర్‌తో మాట్లాడారు. అనంతరం పోచారం శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో గెస్టు ఫ్యాకల్టీలు దేవీసింగ్, సౌమ్య, క్రాంతి, నరేశ్, ఇక్బాల్, కీర్తి, వైశాలి, శ్యాంసుందర్, నారాగౌడ్ తదితరులు ఉన్నారు.

# మైనార్టీ విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ శనివారం యూనిఫాం, స్టేషనరీ, టవల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నదని తెలిపారు. -కామారెడ్డి, ఆగస్టు 24

# రుణమాఫీ చేయాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు

లింగంపేట, ఆగస్టు 24: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూ.రెండు లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణా న్ని మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తంచేశారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బాలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దత్తురాములు, రాంచందర్, పోశెట్టి, ఉదయ్‌కుమార్, మల్లయ్య, భీమయ్య, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్లు

బిచ్కుంద, ఆగస్టు 24: మార్షల్ ఆర్ట్స్ ఆత్మ రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతాయని మార్షల్ ఆర్టిస్ట్, ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్ తక్కడ్‌పల్లి ప్రతిభ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు స్వీయ రక్షణపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటే.. విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తమను రక్షించుకోలుగుతారని తెలిపారు. ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడంతో ఆకతాయిలను ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్, ఆగస్టు 24: మండలంలోని మేనూర్ గ్రామానికి చెందిన భక్తులు శనివారం సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. వారికి మద్నూర్‌లో ప్రముఖ వ్యాపారి నార్ల సంతోష్ పండ్లు అందజేశారు.

# నాగన్నబావి వద్ద అభివృద్ధి పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈఈ గిరి

లింగంపేట, ఆగస్టు 24: లింగంపేటలోని పురాతన కట్టడమైన నాగన్న బావి వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ డీఈఈ గిరి శనివారం పరిశీలించారు. నాగన్నబావిని పర్యటక కేంద్రంగా మార్చడానికి కలెక్టర్ అశీష్ సంగ్వాన్ పర్యవేక్షణలో రెయిన్ వాటర్ ఫౌండర్ కల్పన రమేశ్ నేతృత్వంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. బావి చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బావి చుట్టూ ఫెన్సింగ్ కోసం ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు ఆయన పలు సూచనలు చేశారు. ఎంపీడీవో నరేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, నాయకులు సాయికుమార్, నగేశ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలిగా లక్ష్మీప్రసన్న

ఎల్లారెడ్డి, ఆగస్టు 24: ఎల్లారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు (ఏడీఏ)గా లక్ష్మీప్రసన్న శనివారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రత్న నాలుగు నెలలుగా సెలవులో ఉన్నారు. కామారెడ్డి డీఈవో కార్యాలయంలో ఏడీఏగా పనిచేస్తున్న లక్ష్మీప్రసన్న ప్రస్తుతం ఎల్లారెడ్డి ఏడీఏగా రైతులకు సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# తెరుచుకున్న పోస్టాఫీసు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రామారెడ్డి, ఆగస్టు 24: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో ఉన్న పోస్టాఫీసు శనివారం తెరుచుకున్నది. గ్రామంలో నెలరోజులుగా పోస్టాఫీసుకు తాళం ఉండడంతో విషయాన్ని నమస్తే తెలంగాణ దినపత్రిక శనివారం వెలుగులోకి తెచ్చింది. 'నెలరోజులుగా పోస్టాఫీసుకు తాళం' అనే శీర్షికతో గ్రామస్తుల ఇబ్బందులను పత్రికలో ప్రచురితం చేయడంతో అధికారులు స్పందించారు. మరో గ్రామ పోస్టుమన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. పోస్టాఫీసును తెరిచి పనులు ప్రారంభించడంతో గ్రామంలో వృద్ధులు, ఉపాధి కూలీలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పోసానిపేట్ గ్రామంలో తెరుచుకున్న పోస్టాఫీసు

# పాఠశాలల్లో గోకులాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డి/ లింగంపేట/ బీబీపేట్/ రాజంపేట్, ఆగస్టు 24: పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తుగా గోకులాష్టమి వేడుకలను నిర్వహించారు. ఆది, సోమవారాలు సెలవు కావడంతో ముందుగానే ఉత్సవాలను జరుపుకొన్నారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. నృత్యాలు, ఉట్టి కొట్టడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఎల్లారెడ్డిలోని కేటీఏస్, లింగంపేట మండలంలోని ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం దామోదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో టీచర్లు పద్మ, శివానంద, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు. బీబీపేట్ మండల కేంద్రంతో పాటు మాందాపూర్, తుజాల్‌పూర్, యాడారం, మాల్కాపూర్, కోనాపూర్ గ్రామాల్లోని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో, రాజంపేట మండలంలోని శ్రీ శారద శిశు మందిర్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు.

ఐలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రామారెడ్డి, ఆగస్టు 24: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సదాశివనగర్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన తడిగం రాజిరెడ్డి(41) దుబాయ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ శనివారం తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో మేక మృతి

రామారెడ్డి, ఆగస్టు 24: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఓ మేక మృతిచెందింది. గ్రామానికి చెందిన భూక్యా మోతీరాం గొర్రెల మందను శనివారం అడవికి తీసుకెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌కు మేక తగడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## రేపు వీహెచ్‌పీ స్థాపన దివస్

ఎల్లారెడ్డి, ఆగస్టు 24: విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏండ్లు అవుతున్న సందర్భంగా 26వ తేదీన షష్టాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలను స్థానిక గోపాల స్వామి మందిరంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. యజ్ఞం, గోపూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## అయ్యపల్లిలో జ్వరసర్వే

లింగంపేట, ఆగస్టు24: మండలంలోని అయ్యపల్లి గ్రామంలో వైద్యాధికారులు శనివారం జ్వర సర్వే నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయించారు.

## '108'లో మహిళ ప్రసవం

బిచ్కుంద, ఆగస్టు 24: మండలంలోని తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన అశ్విని 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆమెకు శనివారం పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో బాన్సువాడకు తరలిస్తున్నారు. ఈక్రమంలో ఆమె నొప్పులు అధికమై మార్గమధ్యంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ అనిల్, పైలట్ కాశీనాథ్ తెలిపారు.

**PUBLIC NOTICE**

General public are hereby in formed that my client M/S Shriram finance Ltd Banswada branch, agreed to accord loan to **Borrower Duli Sumalatha W/o. Duli Ramulu, Aged 35 Years, Occ:- Business, R/o. H.No.3-104, Mailaram Village, Nasrullabad Mandal Kamareddy Dist, Property holder : Duli Ramulu S/o. Duli Nadipi Gangaram Aged 42 Years, Occ:- Business, R/o. H.No.3-104, Mailaram Village, Nasrullabad Mandal, Kamareddy Dist** by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below in favour of my client company. if any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within **5 days** of this notice. The objection raised after wards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

**SCHEDULE PROPERTY**

The Dismantle House Bearing **H.No. 2-127/8/12** Area of admeasuring 264.93 Sq yards or (3284.37 sq fts) Situated **Nasrullabad Village & Mandal Kamareddy Dist.** The Under the Jurisdiction of Registration Dist **Nizamabad** Sub Dist **Banswada**

**Bounded as under :**

**East :** 12'feets G.P. Road, **West :** Open place of G.Lasmaiah, **North :** House of Ragavvaya, **South :** House of Savitri

**Sd/- K.SUBBARAO, Advocate,**
Bodhan, Cell:9440004201

## వర్షాల కోసం జలాభిషేకం

జలాభిషేకం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 24: వర్షాలు సమృద్ధిగా కురియాలని కోరు తూ ఎల్లారెడ్డి మండలంలోని సోమారిపేట గ్రామస్తులు ఆలయాల్లో జలాభిషేకం చేశారు. సుమారు వంద మంది గ్రామంలోని చెరువు నుంచి శనివారం నీటిని తెచ్చి ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిపించాలని స్వామిని వేడుకున్నారు.

## పాఠశాలకు మైక్‌సెట్ విరాళం

ఎల్లారెడ్డి, ఆగస్టు 24: మండలంలోని అన్నాసాగర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాలకు పోర్టబుల్ మైక్ సెట్‌ను శనివారం విరాళంగా అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం మైక్ సెట్‌ను అందించినట్లు ఉపాధ్యాయులు సిద్ధిరామాగౌడ్, జోసఫ్ రత్నకాంత్ తెలిపారు. గ్రామ మాజీ సర్పంచ్ పెరుగు నాగరాజు, హెచ్‌ఎం విఘ్నేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మద్నూర్, ఆగస్టు 24: మండలంలోని చిన్నతడ్గూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సాయిలు, హన్మాండ్లుస్వామి, ప్రజ్ఞకుమార్, రాంపటేల్, వట్నాల రమేశ్, అమూల్, గంగాధర్, గోపి, రాజు, బాలు, హన్మాండ్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

గాంధారిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

గాంధారి/ లింగంపేట/ రామారెడ్డి, ఆగస్టు 24: గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య సహాయ అధికారి హరికృష్ణ 249 మంది విద్యార్థులను పరీక్షించి, వారిలో ఏడుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వారికి అద్దాలను రెఫర్ చేశారు. వైద్యులు సాయికుమార్, ఇష్యాంత్ అలి, గౌతమి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. లింగంపేటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు తెలిపారు. మొత్తం 131 మంది విద్యార్థులను పరీక్షించి, అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. సూపర్‌వైజర్లు ఫరీదాబేగం, యాదగిరి, వైద్య సిబ్బంది రాజేశ్వరి, భాగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామంలో రామారెడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మానస ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 136మందిని పరీక్షించారు. 47మంది నుంచి రక్త నమూనాను సేకరించారు. పలువురికి మందులు అందజేశారు. శిబిరంలో ఏఎన్‌ఎం యశోద, వైద్య సిబ్బంది సుప్రియ, ఆశ కార్యకర్తలు సుజాత, కవిత, యశోద పాల్గొన్నారు.